క్లుప్తంగా

వైభవంగా మర్లమాంబ పండగ


పూజలందుకున్న మర్లమాంబ

సబ్బవరం: మండలంలోని పెదనాయుడు పాలెంలో కొలువైన మర్లమాంబ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రాత్రికి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో కేకేఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

పెందుర్తి: పదో తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో చినముషిడివాడ కేకేఆర్ గౌతం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వై.చరిస్మా 500/487 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. 483 మార్కులతో ఎస్.రీనా, 475 మార్కులతో ఆర్.హాసిని, 471 మార్కులతో బి.పూజిత వరుస స్థానాల్లో నిలిచారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీన్ కె.శేషుబాబు, ప్రిన్సిపాల్ బి.భాగ్యలక్ష్మి, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

విద్యార్థిని మృతికి సంతాపం


గాయత్రి (ఫైల్)

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతిపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి మంగళవారం సంతాపం తెలిపారు. కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గొటివాడకు చెందిన గాయత్రి ఎంతో క్రమశిక్షణతో నడుచుకొనేదన్నారు. ఆమె అకాల మరణంపై అధ్యాపకులు, విద్యార్థులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహా లక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉద యం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హోమం


స్వామి వారి ఆలయ ప్రాంగణంలో హోమంలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ముందుగా 108 కలశాలతో స్వామి వారికి అభిషేకాలు చేసిన అనంతరం ప్రత్యేక హోమాలు చేశారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రమణానంద స్వామిజీ చేతుల మీదుగా ఈ పూజలు జరిగాయి. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, విల్లూరి శ్రీనివాసరావు, అప్పలరెడ్డి, పెంటకోట వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

- ఓటెత్తిన మహిళా లోకం
- నియోజకవర్గంలో పురుషుల కంటే స్త్రీ ఓటింగే అధికం
- మొత్తం ఓటర్లు 3,07,545 మంది
- ఓటేసిన మహిళలు 1,16,766 మంది
- ఓటేసిన పురుషులు 1,11,970
- 74.38 శాతం పోలింగ్ నమోదు


పెందుర్తిలో సోమవారం రాత్రి ఓట్లు వేసేందుకు క్యూలో మహిళలు

పెందుర్తి: మహిళా లోకం ఓటెత్తింది. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, ఇతరాత్ర పథకాల ద్వారా మహిళలకు ఎనలేని మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు మద్దతిచ్చారని సోమవారం ముగిసిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి చెప్పకనే చెబుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గంలోని మహిళలు ముందడుగు వేశారు. సోమవారం అర్ధ రాత్రి వరకు జరిగిన పోలింగ్‌లో పురుషుల కంటే అధికంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తద్వారా పెందుర్తి అసెంబ్లీ సమరంలో విజేతను నిర్ణయించే శక్తిగా ఎదిగారు.

నిరీక్షించి మరీ

వాస్తవానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో చాలాచోట్ల ఈవీఎం యంత్రాలు మొరాయించాయి. దీంతో పోలింగ్ ఆలస్యం అయినా ఎండలో గంటల తరబడి నిరీక్షించి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలుచోట్ల సాయంత్రం ఓటేసేందుకు వచ్చిన చాలా మంది మహిళలు రాత్రి 12 దాటినా సరే సహనంతో నిలబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూడా నియోజకవర్గంలో మహిళలే అధికంగా ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. నాటి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది.

ఓట్లు పెరిగినా పోలింగ్ శాతం అదే

2019 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం, తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం దగ్గరగా ఉండడం విశేషం. గత ఎన్నికల్లో పెందుర్తిలో 74.74శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి దాదాపు అదే స్థాయిలో 74.38 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు ప్రకటించారు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నుంచి మొత్తం 2,68,532 మంది ఓటర్లకు గాను 2,00,658(74.72 శాతం) మంది ఓటేశారు. ఇందులో పురుషులు 99,771(74.09శాతం) కాగా స్త్రీలు 1,00,888(75.37) శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తాజా ఎన్నికల్లో..

తాజా ఎన్నికల్లో..3,07,545 మంది ఓటర్లకు గాను 2,28,740 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,52,592 మందికి గాను 1,11,970 మంది, స్త్రీలు 1,54, 948 మందికి 1,16,766 మంది ఓటు వేశారు. అనేక కారణాలతో 78,805(పురుషులు/స్త్రీలు) మంది ఓటుకు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో కూడా మగువలు ముందంజలో ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి 15,878 మంది స్త్రీలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అర్ధరాత్రి దాకా పోలింగ్

నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 2,28,740 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చితే 28,082 మంది అదనంగా ఓటేశారు. ఇందులో 15,878 మంది స్త్రీలే ఉన్నారు. మరోవైపు నియోజకవర్గంలో సరిపల్లి, పెదగాడి, గొరపల్లి, గొల్లవిల్లివానిపాలెం, రాయపుర అగ్రహారం, వెదుళ్ల నరవ, సబ్బవరం ప్రభుత్వ కళాశాల, ముత్యాలమ్మపాలెం, వాడచీపురపల్లి తదితర ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా సాయంత్రం 6(సమయానికి క్యూలో ఉన్నవారు) నుంచి అర్ధరాత్రి పోలింగ్ పూర్తయ్యేసరికి దాదాపు 7వేల మంది వరకు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సమాచారం. నిద్రాహారాలు మానుకుని ఆ సమయం వరకు ఓటేసి పౌరులుగా తమ బాధ్యతను నిర్వర్తించడం పట్ల రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెట్టింగ్ బంగార్రాజులు

- జోరుగా సాగుతున్న పందాలు
- ఓ వైపు ఐపీఎల్..మరోవైపు పొలిటికల్
- రూ.కోట్లకు చేరుకున్న జూదం



పెందుర్తి: 'ఈ ఓవర్లో వికెట్ పడుతుంది..మీది వెయ్యి మాది ఆరు వందలు'. మ్యాచ్‌లో ఫలానా జట్టు గెలుస్తుంది..మీ పందెం పదివేలు..మాది పదిహేను వేలు' ఇది ఐపీఎల్ రోజువారీ బెట్టింగ్'..మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత'మీ పందెం రూ.లక్ష..మాది రూ.70 వేలు' ఇది రాజకీయ జూదం.. పెందుర్తి ప్రాంతంలో పందాల జోరు హోరెత్తుతోంది. ఓ వైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగడంతో మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరోవైపు ఇండియన్ పొలిటికల్ లీగ్ తోడవడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. పట్టణం, పల్లెలు తేడా లేకుండా పందాలు జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్‌లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు వేదికగా క్రికెట్‌తో పాటు పొలిటికల్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. సగటున రూ.లక్షలు పందం కాస్తుండగా మొత్తంగా కలిపి రూ.కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నాకౌట్ పోటీలతో పాటు ఎన్నికల ఫలితాలకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ఈ బెట్టింగ్ విశ్వరూపం దాల్చే పరిస్థితి కనబడుతోంది. ఈ బెట్టింగ్‌లకు నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు కూడా పెడుతున్నట్లు తెలుస్తుంది.

మీది ఇంత.. మాది ఇంత

ఐపీఎల్ విషయానికి వస్తే ఓవర్‌కు పరుగులు, వికెట్లు పడే సమయాలు, నోబాల్‌లు, వైడ్లు ఎప్పుడు పడతాయి.. ఫోర్లు, సిక్సర్లు ఎప్పుడు కొడతారు. వీటికి రూ.వేలల్లో పందాలు వేసుకుంటున్నారు. ఆఖరిగా మ్యాచ్‌ల ఫలితాలపై భారీగానే పందాలు సాగుతున్నాయి. జట్ల బలబలాల బట్టి పందెంరాయుళ్లు బరిలోకి దిగుతున్నారు. ఒక జట్టు బలహీనంగా ఉంటే దానిపై తక్కువ మొత్తం పందెం వేస్తున్నారు. బలమైన జట్టు వైపు ఉన్నవారు దానికి కాస్త ఎక్కువ మొత్తం పందెం కాస్తున్నారు. ఉదాహరణకు బలమైన జట్టుపై రూ. పది వేలు పెడితే..బలహీనమైన జట్టుపై రూ.5 వేలను నుంచి 7 వేల వరకు. ఈ పందాల కోసం ప్రత్యేకంగా పేకాట మాదిరిగా డెన్లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

కోసు పందాలు

రాజకీయ బెట్టింగ్ విషయానికి వస్తే వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని..అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందాలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ.లక్షల్లో పందాలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘననీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెంరాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది. అయితే ఈ మాయా జూదానికి పోలీసులు అడ్డుకట్ట వేయాల్సి ఉందని పలువురు భావిస్తున్నారు.

ప్రజా మద్దతుతో ప్లాంటును రక్షించుకుంటాం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1188వ రోజుకు రిలే దీక్షలు


మాట్లాడుతున్న ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రైవేటు సంస్థకు అప్పగించడానికి తలో చేయి వేసి సహకారం అందిస్తున్నారని, అదే నేడు ఈ దుస్థితికి కారణమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతుతో ప్లాంటును పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1188వ రోజు శిబిరంలో వారు మాట్లాడారు. గంగవరం పోర్టు యాజమాన్యం సృష్టిస్తున్న అవరోధాలు, అడ్డంకులు ప్రజల సహకారంతో ఎప్పటికైనా తొలగిపోతాయన్నారు. కుట్రలెన్ని చేసినా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించలేరన్నారు. ప్రజలు తలచుకుంటే పాలకులే కాదు, ఏ పారిశ్రామికవేత్తలు, తొత్తులు నిలబడలేరన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.రామ్మోహనకుమార్, డి.శ్రీనివాస్, జి.నరేంద్ర, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చిస్వామికి అభిషేకాలు చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవం


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు బేరి గురుమూర్తిరెడ్డి తదితరులు


కాళీమాత వేషధారణలో కళాకారులు

సీతమ్మధార : రేసవానిపాలెం గ్రామ ఇలవేల్పు శ్రీకనకమ్మ నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పసుపు కుంకుమలు, ఫల పుష్పాలు ,ఇతర కానుకులు సమర్పించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సేవ గరిడీ, పులివేషాలు, నేల వేషాలతో అమ్మవారి అనుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేసవానిపాలెం గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి, సెక్రటరీ జీరు అప్పలస్వామిరెడ్డి, కోశాధికారి గాలి శివకుమార్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్మయానంద జయంతి

ఉక్కునగరం: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిన్మయానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్మయానంద 108వ జయంతి సందర్భంగా చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో 'చిన్మయ శంకరం' పేరిట ఈ వేడుకలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 వరకు కూర్మన్నపాలెం అన్నపూర్ణ థియేటర్ సమీప శ్రీకృష్ణ ఈడెన్ ఫంక్షన్ హాల్లో పాదుకా పూజ నిర్వహించారు. మహిళలచే భజనలు, కోలాటం జరిగాయి. బాలలు భరతనాట్య ప్రదర్శనతో తమ ప్రావీణ్యత చాటారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పనిచేయని కోచ్ ఇండికేటర్లు

ప్రయాణికుల అవస్థలు


దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తరచూ కోచ్ ఇండికేటర్లు పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు ఎక్కాల్సిన కోచ్ ఎక్కడికి వచ్చి ఆగుతుందో తెలియక లగేజీలు, వృద్ధులు, పిల్లలతో పరుగులు తీయాల్సి వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పునరావృతం కాకుండా చూడాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులను కోరారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం


గౌరీపరమేశ్వరుల అమ్మవారు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి గరికి వెంకటరావు, మద్దాల కూర్మారావు మంగళవారం తెలిపారు. మెయిన్‌రోడ్డు రహదారి విస్తరణలో సుమారుగా 15 సంవత్సరాల క్రితం అమ్మవారి ఆలయాన్ని తొలగించారని, ఆలయ వెనుకభాగాన ఉన్న స్థలం వ్యక్తి సాయంతో అమ్మవారి గర్భగుడిని మూడు సంవత్సరాల పునఃనిర్మించినట్టు చెప్పారు. ఈ ఆలయానికి సుమారు 170 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం సుమారుగా 10వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు. సాయంత్రం 6 గంటలకు గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు రేజేటి అప్పలచార్యులు(చక్రవర్తి)వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. కల్యాణంలో కూర్చునే దంపతులు కమిటీవారిని సంప్రదించి పేర్ల నమోదు చేసుకోవాలన్నారు.

ఉప్పురైతు దిగాలు

గిట్టుబాటు కాని ధర


దలాయిపాలెంలో ఉప్పుగళ్లీలు


పండిన ఉప్పును గట్లపైకి చేర్చుతున్న కూలీలు


నిల్వ చేసిన ఉప్పు

పరవాడ: మండుటెండలో చమటోడ్చి పండించిన ఉప్పుకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు సతమతమవుతున్నారు. వాడచీపురుపల్లి శివారు దళాయిపాలెంలో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, గొరుసువానిపాలెం, పందివానిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఉప్పు పంట సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే నాలుగు డబ్బులు కళ్ల చూస్తారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైతే నష్టాల ఊబిలో కూరుకుపోవడం వీరి వంతవుతుంది. ఏటా నవంబరు నుంచి రైతులు ఉప్పు పంట సాగుకు ఉపక్రమించి మే వరకు సాగు చేస్తారు. ఉప్పు మడుల మరమ్మతులతో పాటు చెరువుల్లో నీరు నింపడం వంటి పనులు చేపట్టి మార్చి నుంచి ఉప్పు తీస్తారు. ఆడ కూలీకి రూ.500, మగ కూలీలకు రూ.600 చెల్లిస్తారు. పండించిన ఉప్పును విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తారు.

ఇలా..

ప్రస్తుతం దళాయిపాలెంలో పండిన ఉప్పు 80 కిలోల బస్తా ధర మొదటి రకం రూ.200, రెండో రకం రూ.190, మూడో రకం రూ.150 నుంచి రూ.170 పలుకుతోంది. కాగా ఈ ఏడాది ఉప్పు పంట ఆశాజనకంగా ఉంది. అయితే ధర ఆశాజనకంగా లేకపోవడంతో రైతులకు తీవ్ర నిరాశ ఎదురైంది. నెల్లూరు నుంచి ఉప్పు నిల్వలు ఉత్తరాంధ్ర జిల్లాలకు దిగుమతి అవుతున్న నేపథ్యంలో కష్టపడి పండించిన ఉప్పుకు గిట్టుబాటు ధర పలకడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తక్కువ ధరకు లభించే నెల్లూరు ఉప్పుపై వ్యాపారులు మక్కువ చూపడంతో దలాయిపాలెంలో పండించిన ఉప్పుకు డిమాండ్ తగ్గిందని రైతులు వాపోతున్నారు.

పెరుగుతున్న నిల్వలు

ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉప్పు పంట ఆశాజనకంగా ఉంది. ఫలితంగా ఉప్పు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఏదోఒక ధరకు విక్రయిద్దామన్నా వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రోజు రోజుకూ నిల్వలు పేరుకుపోతున్నాయి. పండించిన ఉప్పు అమ్ముకోలేక పోవడంతో పెట్టుబడులు చేతికి రావడం లేదు. ఫలితంగా తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక అష్టకష్టాలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

గిట్టుబాటు ధర లేదు

దలాయిపాలెంలో నాలుగు ఎకరాల్లో ఉప్పు పంట సాగు చేస్తున్నాను. ఈ ఏడాది ఉప్పు పంట ఆశాజనకంగా ఉంది. కానీ గిట్టుబాటు ధర లభించ లేదు. ఇతర జిల్లాల నుంచి తక్కువ ధరకు దిగుమతి చేయడంతో మేము పండించిన ఉప్పుకు గిట్టుబాటు ధర పలకడం లేదు. దీంతో కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు.

– బూన రామకృష్ణ, రైతు, గొరుసువానిపాలెం

అకాల వర్షంతో నష్టం

నేను నా కుటుంబం ఉప్పు పంటపై ఆధారపడి జీవిస్తున్నాం. ఈ ఏడాది ఉప్పు పంట బాగుంది. ఇటీవల కురిసిన అకాల వర్షం వల్ల పండించిన ఉప్పు నీట పాలై తీవ్రంగా నష్టపోయాను. గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో అకాల వర్షాల కారణంగా నష్టాల్లో కూరుకుపోతున్నాం.

– గొరుసు రామునాయుడు, రైతు, గొరుసువానిపాలెం

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


బార్ అసోసియేషన్ నూతన కమిటీతో ప్రయాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్

అనకాపల్లి: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్ తెలిపారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో మంగళవారం ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడు ఎం.జె. వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి సందీప్, ఉపాధ్యక్షుడు రోజా, సహాయ కార్యదర్శి తులసి, స్పోర్ట్స్ కార్యదర్శి మోహన్, లైబ్రేరియన్ ప్రతినిధి జగపతి, మహిళా ప్రతినిధి కుసుమతో పాటు మరో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కోర్టు కొత్త భవనం నిర్మాణ కోసం సీనియర్ లాయర్లను అందరినీ సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటానని చెప్పారు.

23న పౌర్ణమి పూజలు

సీతంపేట: వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో విశేష పూజలు చేయనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ నెల 23న ఉదయం 7.30 గంటలకు రమాసత్యనారాయణ స్వామికి పంచామృత అభిషేకం, మణిద్వీపంలో శ్రీచరఖ వనావరణ, అలాగే లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ జరుగుతుందన్నారు.

చెత్తకు నిప్పు.. ఎగసిన మంటలు


చెలరేగుతున్న మంటలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు ప్రధాన గెడ్డ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ గ్రామాన్ని ఆవరించడంతో ఏం జరిగిందోనని జనం ఆందోళన చెందారు. సంఘటన స్థలం వద్దకు పరుగులు తీశారు. అయితే గెడ్డ పక్కన ఉన్న చెత్తకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వచ్చాయని తెలుసుకుని, వెంటనే పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందజేశారు. స్పందించిన వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.